17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శనివారం | 15 జూన్ 2024 | పేజీలు 10



## టీటీడీ ఈఓగా జే.శ్యామలరావు నియామకం

తిరుమల, మేజర్‌న్యూస్:
టీటీడీ ఈఓగా జే.శ్యామలరావును నియమిస్తూ క్యాబినెట్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఆయన టీటీడీ ఈఓగా బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం టీటీడీ ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మారెడ్డి రిలీవ్ అవ్వాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షకు
# పకడ్బందీగా ఏర్పాట్లు

**తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 9000665565, 9676928804**

**తిరుపతి జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు**

**హాజరు కానున్న 5518 మంది అభ్యర్థులు : జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్**




తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:
ఈనెల 16న ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు 2024 పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నందు ఈ నెల 16న జరగనున్న యు.పి.ఎస్.సి. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు 2024 పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు 11 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 5518 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇందుకొరకు 11 మంది లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారి(తహశీల్దార్), 11చీఫ్ సూపరింటెండెంట్స్, 5 మంది జిల్లా అధికారులను సహాయ సమన్వయ అధికారులుగా విధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా జాయింట్ కలెక్టర్ అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారని, తిరుపతి ఆర్.డి.ఓ. పరీక్ష పేపర్ల కస్టోడియన్‌గా వ్యవహరించనున్నారని. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో 15, 16 తేదీలలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 9000665565, 9676928804లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుండి 11.30, మధ్యాహ్నం 2.30 నుండి 4.30వరకు రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహణ ఉంటుందని పరీక్షల సమయానికి 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారని ఆపై ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. పరీక్ష రాయనున్న అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడి కార్డు కూడా తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్‌సెట్స్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం, మెడికల్ క్యాంప్‌లు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులు చూడాలని, తాగు నీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, పోస్టల్ డిపార్ట్మెంట్‌కు పూర్తి అయిన పరీక్ష పత్రాలను సక్రమంగా అందించాల్సి ఉంటుందని ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్ టి సి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరీక్ష రాసే అభ్యర్థులు ముందు రోజే వచ్చే విధంగా చూసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో జామర్ ఏర్పాటు సంబంధిత ఏజెన్సీ ఏర్పాటు చేస్తారని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా

మిగతా 2లో

## డివిజన్‌లో పోలీస్ బదిలీలపై
# ప్రత్యేక దృష్టి



**కార్యకర్తల మనోభావాల మేరకే!**
**బాధ్యుల నుంచి సమాచారం!**

గూడూరు, మేజర్‌న్యూస్:
వైకాపా అధికారంలో ఉన్న సమయంలో ఎస్ బాస్ సంస్కృతికి అలవాటు పడి సిలికా, ఇసుక, క్వార్ట్జ్ రవాణలో జాతీయ రహదారి వెంబడి అక్రమాలకు పాల్పడిన పోలీసులను సాగనంపాలని తెలుగుదేశం నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ప్రధానంగా ప్రభావితమైయ్యే పోలీసుశాఖపై అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఐదు సంవత్సరాలుగా డివిజన్ పరిధిలోని మండలాలు, పట్టణాల్లో నాయకులు కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పావులుకదుపుతున్నట్లు తెల్సింది. డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో (గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట) పోలీసు బదిలీలకుఅన్నీ సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మూడు నియోజకవర్గాల పరిధిలో బదిలీల జాబితాను నాయకులు కార్యకర్తల నుంచి తెలుగుదేశం ప్రధాన నాయకుడు సేకరించినట్లు సమాచారం. ప్రధానంగా గూడూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆయన అందుకనుగుణంగా పావులు కదుపుతున్నట్లు తెల్సింది. డివిజన్ పరిధిలో గూడూరు నియోజకవర్గంలోనే ఎన్నికల సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గూడూరు నియోజకవర్గ పరిధిలో పూర్తిస్థాయిలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు తెల్సింది. డివిజన్ కేంద్రంలోనే ఇప్పటి వరకు సబ్‌డివిజన్ అధికారి ఉన్నా గత సంవత్సరంలో నాయుడుపేట సబ్‌డివిజన్‌గా చేయడంతో కొంతమేర వెసులుబాటు వచ్చింది. అయితే రెండు సబ్‌డివిజన్ల పరిధిలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆ నాయకులు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారని తెలుస్తోంది. దీంతో బదిలీల రాజకీయం వారి చుట్టూ సాగుతోంది. అయితే పార్టీకి, కార్యకర్తలకు ఇబ్బంది కరంగా మారిన వారిని ఎట్టి పరి స్థితిలోనూ ఉపేక్షించబోమని కార్యకర్తలకు హామీ ఇచ్చినట్లు తెల్సింది. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని

మిగతా 2లో

## వైకాపాకు కలిసి రాని మండల అధ్యక్షుల మార్పు..!

**టీడీపీని అందలం ఎక్కించడానికి దోహదం**

**అధ్యక్షుల మార్పు వద్దని వారించినా వినని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



వివరాలు 5లో

## బక్రీద్ త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీక

**చిత్తూరు ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు**



చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్: బక్రీద్ పండుగ త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీక అని చిత్తూరు ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు తెలిపారు. బక్రీద్‌పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలు సుఖ శాంతులతో ఈ పర్వదినాన్ని జరుపుకోనేటట్లు ఎస్పీ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమైనది. ప్రత్యేకంగా గత కొన్ని రోజులుగా ముందస్తు భద్రత చర్యలలో భాగంగా మసీదుల వద్ద, ముస్లిం ప్రజలు నివసిస్తున్న ప్రదేశాల నందు మత పెద్దలతో పోలీసు అధికారులు సమావేశాలు జరుపుతూ బక్రీద్ పండుగ సందర్భముగా ఎలాంటి సమస్యలు రాకుండా ప్రార్థన సమయములో ఇతర కార్యక్రమాలు జరుపునప్పుడు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచిస్తూ విజ్ఞప్తి చేశారు. కావున ప్రజలు క్రింద కనబరిచిన విషయాలను గుర్తుంచుకొని జిల్లా నందు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించవలసినదిగా తెలిపారు.గోవులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశంకు తరలిస్తున్న సందర్భాలలో తగిన పత్రాలను వుంచుకొనవలెను. శాంతి భద్రతల సమస్యలు, మత సంఘర్షణలు ఉత్పన్నం అయ్యే విధంగా ఎవ్వరు ప్రవర్తించకూడదు, ప్రేరేపించకూడదని అలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోనబడును. సోషల్ మీడియా నందు మతసంఘర్షణలు తలెత్తే పోస్టులు పెట్టకండని, పుకార్లను నమ్మవద్దు, అపోహలు, వదంతులను నమ్మి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయరాదు. ఎక్కడైనా ఏదైనా అసాంఘిక, అనైతిక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112 లేదా లోకల్ పోలీస్ వాట్సప్ నెంబర్ 9440900005కి సమాచారం ఇవ్వవలసిందిగా సూచించారు.

# డివిజన్‌లో పోలీస్ బదిలీలలపై ప్రత్యేక దృష్టి

**(మొదటిపేజీ తరువాయి)**

చిల్లకూరు, చింతవరం గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలపై పూర్తి సమాచారం తీసుకున్నట్లు తెల్సింది. ఇప్పటికే చిల్లకూరు ఎస్ఐని విఆర్‌కు పంపిన అధికారులు మిగిలిన అధికారులు, సిబ్బందిపై కూడ నియోజకవర్గ బాధ్యుల సూచన మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెల్సింది. గూడూరు ఎంఎల్ఏ కూడ డిఎస్‌పి కారణంగా తనకు ప్రాణ హాని ఉందని పేర్కొని ఉండడం విశేషం. దీంతో నియోజకవర్గంలో పోలీసు బదిలీలపై వాడి వేడిగా చర్చలు సాగుతున్నాయి. డిఎస్‌పి, సిఐల వ్యవహార శైలిపై పలు విమర్శలు ఉన్నాయి. వైకాప అధికారం లో ఉన్న సమయంలో వారు ఇష్టానుసారం వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలువురు కానిస్టేళ్లను జిడిలుగా నియమించు కుని అడ్డగోలు వ్యవహారాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పని చేస్తున్న ఒక కానిస్టేబుల్ డిఎస్‌పి జిడిగా వ్యవహరిస్తూ వివాదస్పదంగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైకాప నాయకులకు అడుగులకు మడుగులొత్తూ తెలుగుదేశం కార్యకర్తలను ఇబ్బంది పెట్టి నట్లు ఆరోపణలు ఉన్నాయి. పని చేయా ల్సింది ఒక స్టేషన్‌లో అయితే డిఎస్‌పి ద్వార చిల్లకూరు స్టేషన్‌కు అటాచ్ చేయించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు తెల్సింది. చిల్లకూరు గ్రామంలో ఒక కేసు విషయంతో పలువురు యువకులను స్టేషన్‌కు తీసుకు వచ్చి అర్ధ నగ్నంగా ఉంచి పెద్ద మొత్తంలో డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారాన్ని చిల్లకూరు గ్రామస్తులు తెలుగుదేశం పెద్దలకు చేరవేయడంతో ఆ కానిస్టేబుల్‌పై గుర్రుగా ఉన్నట్లు తెల్సింది. అదే విధంగా చిల్లకూరు స్టేషన్‌లో పని చేస్తున్న మరి కొందరిపైనా వైకాప తొత్తులుగా వ్యవహరించిన సిబ్బందిని బదిలీ చేయించేందుకు రంగంసిద్ధం చేసినట్లు తెల్సింది. చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న ఘర్షణ తదనంతర పరిణామాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపైనా చర్యలకు పూనుకున్నట్లు తెలుస్తుంది. అదే విదంగా గూడూరు పట్టణం, రూరల్ పోలీస్ స్టేషన్లలో వైకాప సానుబూతి పరులుగా వ్యవహరించిన సిబ్బందిని ఆయా నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు విచారణ జరిపి సాగనంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెల్సింది. డివిజన్‌లో గూడూరు రెండు సర్కిళ్లతో పాటు వాకాడు సర్కిల్‌లలో అటుఇటూ బదిలీలు చేయించుకుంటూ దీర్ఘ కాలంగా ఈ డివిజన్‌లోనే ఉంటూ ఇలాకాలో కొందరు వివాదస్పద పనుల్లో తలమునకలై ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి అలాంటి వారిని గుర్తించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని అధికారులు సిబ్బంది తెలుగుదేశం అధినేతను కలిసేందుకు వస్తున్నా వివాదస్పద సిబ్బందికి అధికారులకు ఎటువంటి హామీ ఇవ్వడంలేదని తెల్సింది. సిలికా, క్వార్ట్జ్ అక్రమ రవాణాలో ఆరి తేరిన కొందరు అధికారులు, సిబ్బందిపై కూడ తగిన చర్యలు తీసుకునేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

వైకాపాకు కొమ్ము కాసి అక్రమ రవాణలో ఆరి తేరిన కొందరు పోలీసులు లూప్ లైన్‌లోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెల్సిం ది. మరికొందరు అధికారులు, సిబ్బంది మాత్రం ఫలితాలు వచ్చినప్పటి నుంచి అధినాయలకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెల్సింది. తామేమి చేస్తామని అధికారంలో ఉన్న వాళ్లు చెప్పేది చేయకుంటే తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకోవాలని చిరుద్యోగులం అంటూ సన్నాయి నొక్కులు నొక్కతున్నట్లు తెల్సింది. ఏదిఏమైనా నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు తెలుగుదేశం అధినాయకులు సిద్ధం అవుతున్నట్లు తెల్సింది.

## యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షకు
# పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

**(మొదటిపేజీ తరువాయి)**

పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ శాఖ వారు నిబంధనల మేరకు అభ్యర్థుల ఫ్రిస్కింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, యుపీఎస్సి అధికారి, విధులు కేటాయించబడిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్స్ట్రక్టింగ్ అధికారులు, సహాయ కోఆర్డినేటింగ్ అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

**పరీక్షా కేంద్రాల కోడ్ /వివరాలు :**

1) 50005 శ్రీపద్మావతి గర్ల్స్ హై స్కూల్, బాలాజీ కాలనీ, తిరుపతి
2) 50015 శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం , తిరుపతి
3) 50007 ఎస్వీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, ప్రకాశం భవన్, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి
4) 50008 ఎస్వీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్, తిరుపతి
5) 50011 శ్రీ గోవింద రాజ స్వామి ఆర్ట్స్ కళాశాల (వింగ్-ఏ), తిరుచానూరు రోడ్డు, తిరుపతి
6) 50012 శ్రీ గోవింద రాజ స్వామి ఆర్ట్స్ కళాశాల (వింగ్-బీ), తిరుచానూరు రోడ్డు, తిరుపతి
7) 50013 ఎస్ఎస్‌వి హై స్కూల్, చావడి వీధి, మహతి ఆడిటోరియం వెనుక, తిరుపతి.
8) 50018 ఎస్.విఆర్ట్స్ కాలేజ్ (వింగ్-ఏ) బాలాజీ కాలనీ, తిరుపతి
9) 50019 ఎస్.వి ఆర్ట్స్ కాలేజ్ (వింగ్ -బీ) బాలాజీ కాలనీ, తిరుపతి
10) 50001 శ్రీ పద్మావతీ మహిళా జూనియర్‌కాలేజ్(వింగ్-ఏ), తిరుపతి.
11) 50002 శ్రీ పద్మావతీ మహిళా జూనియర్ కాలేజ్ (వింగ్-బీ), తిరుపతి.

# గ్రావెల్ తరలింపు అడ్డుకున్న ఎమ్మెల్యే సోదరుడు

**లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మండలం ఎల్ ఆర్ పేట పంచాయతీ వెంకటాద్రి గ్రామం సమీపంలో గురువారం అర్ధరాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా ఎమ్మెల్యే సోదరుడు నిధి అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. కార్వేటి నగరం మండలం ఆలత్తూరు చెందిన వైయస్సార్ పార్టీ నాయకుడు వెంకటాద్రి పురం ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా గ్రావెల్ హిటాచి ద్వారా త్రవ్వి టిప్పర్ లో పుత్తూరుకి తరలించి ఖాళీగా వస్తున్న టిప్పర్ను నిలువరించి పుత్తూరు కార్వేటినగరం పోలీసులు సమాచారం ఇచ్చారు. ఖాళీగా వస్తున్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 11 గంటలకు స్థానిక కోర్టు వద్ద ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలియజేశారు. న్యాయవాదులుకేక్ కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ మొట్టమొదటిగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని పలమనేరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యమం మొదలు పెట్టినామని అది చిలికి చిలికి గాలి వానల విస్తరించి రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు రైతు సంఘంలు ప్రజా సంఘంలో పెద్ద ఎత్తున ఆందోళనలునిర్వహించారు. దీక్షలుధర్నాలుపార్టీలకు అతీతంగా చేపట్టారని తెలిపారు. న్యాయవాదుల సంఘాలు టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష కు మాజీ మంత్రి ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి ద్వారావిన్నవించా మన్నారు. అనంతరం శాంతిపురం బహిరంగ సభలో నారా లోకేష్ పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటాలింగ్ యాక్టును రద్దు చేస్తామనిహామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కూడా ఇదే విషయమును పలుమార్లు ప్రస్తావించారు. ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండవ సంతకం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, న్యాయవాదులు ఎల్ భాస్కర్, షరీఫ్, లక్ష్మణ్, జగదీష్, కృష్ణప్ప, చంద్రశేఖర్, లోకేష్, సుబ్రహ్మణ్యం, ఇబ్రహీం, ఇక్బాల్, రాజారెడ్డి, రెడ్డప్ప శెట్టి, గాంధీ, వనజాక్షి, చాందిని, పుష్పాంజలి, సంధ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

**ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాలలో పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ ఏవి, బ్రహ్మానంద రెడ్డిఅన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖలు చేపట్టిన అభివృద్ధి నివేదికలకు సంబంధిత అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుడా నిధులతో నిర్మించిన ఆరో ప్లాంట్లు సక్రమంగా పనిచేసేటట్లు చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతులు పంచాయితీ నిధులు వినియోగించాలని కొనియాడారు. పంచాయతీ నిధులు లేని చోట నిధులు మంజూరు చేస్తామన్నారు. మండల పరిషత్ సాలిడ్ వెస్ట్ కేంద్రాలను వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులు పిల్లలను ప్రసవించిన ప్రదేశంలోనే జనధ్రువీకరణ పత్రాలు ఆదేశించేవిధంగా అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. నెన్నురు ఆర్టీసీ బస్సు నడపకపోతే ధర్నా చేస్తాం సర్పంచ్ అనసూయ తిరుపతి నుంచి నెన్నూరు మీదుగా అప్పలాయగుంట వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని సర్పంచ్ అనసూయ సంబంధిత అధికారులను కోరారు.



గత సర్వసభ్య సమావేశంలో కూడా ఆర్టీసీ బస్సులు తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు నడపాలని అడగగా పట్టించుకోలేదన్నారు. నెన్నూరు మీదుగా అప్పలాయ గుంటకు బస్సు నడపకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , ప్రత్యూష వైస్ ఎంపీపీ లావణ్య చంద్రబాబు, ఎంపీటీసీలు కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, మునేంద్ర బాబు యాదవ్, సర్పంచులు గోవర్ధన యాదవ్, హిమాల రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి నిరంతరాయంగా
# సప్తగిరి సంగీత సప్తాహం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మనోవికాస్, మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నిరంతరాయంగా సప్తగిరి సంగీత సప్తాహ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మనోవికాస్ ప్రతినిధి, నిర్వాహకుడు పున్న మరాజు మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యశోదనగర్‌లోని



వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో ఏడు రోజుల పాటు సాగే ఈ సప్తగిరి సంగీత సప్తాహ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాక సింగపూర్, యూఎస్ఏ వంటి దేశాల నుంచి కూడా ప్రముఖ సంగీత విద్యాంసులు, కళాకారులు హాజరై తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి సభికులను అలరింపజేయనున్నారని తెలిపారు. 16వ తేదీ ఉదయం 9 గంటలకు ఆరంభమయ్యే ఈ సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమం 23వ తేదీ ఉదయం 9 గంటల వరకు నిరంతరాయంగా సాగుతూ పరిసమాప్తమవుతుందన్నారు.

ఇందులో భాగంగా తొలి రోజైన 16వ తేదీన శాస్త్రీయ సంగీత కచేరీలు, 17న సంప్రదాయ నామ సంకీర్తనలు, 18న హరికథా గానాలు, 19న పురందరదాసాది కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం, 20న భద్రాచల రామదాస, అపురూప వాగ్గేయకారుల కీర్తనలు, కృతుల గానం, 21న అన్నమాచార్య సంకీర్తనల విభావరిలు. 22న అన్నమాచార్య భక్తి భావ స్వర తరంగాతరంగాలు వంటి సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు, ప్రజలందరూ హాజరై ఆస్వాదించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైష్ణవీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పుదిపట్లలో వెలసివున్న వైష్ణవీ దేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలమ నిర్మాణ దాత వినోద్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి చంద్రబాబు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ,



ల్యాండ్ టైటిల్ యాక్ట్, అన్నా క్యాంటీన్లు, పెన్షన్ 4000కు పెంచుతూ నిర్ణయం తీసుకొని అమల్లోకి తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అని తిరుపతి పార్లమెంటు టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం కొనియాడారు. మాట తప్పని నేతగా ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తొలి సంతకం మెగా డీఎస్సీ పై చేస్తానని హామీ ఇచ్చి చెప్పినట్లుగా తొలి సంతకం చేశారన్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉన్నత చదువులు చదువుకుని ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్న నిరుద్యోగులు ఇకపై తమ సొంత ఊరిలోనే ఉంటూ ఇక్కడే ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే ప్రజల భూములకు రక్షణ లేని పరిస్థితి కల్పించిన గత ప్రభుత్వ ల్యాండ్ టైటిల్ ఆక్ట్ ను రద్దు చేయడం, నిరుపేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పేరుతో వృద్ధాప్య పెన్షన్ కింద ఏప్రిల్ నెల నుంచి జూన్ నెల వరకు వెయ్యి రూపాయలు, ప్రభుత్వం ప్రకటించిన నాలుగు వేల రూపాయలు కలిపి 7,000గా జూలై నెల ఒకటవ తేదీన అందించనున్నారని చెప్పారు. దివ్యాంగులకు నెలకు 6000 పెన్షన్, పూర్తిగా అంగవైకల్యం కలిగిన వారికి నెలకు 15 వేల రూపాయలు ఇవ్వడం భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో కూడా అమలు కాలేదన్నారు. నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి కూడా ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు నాయుడు సంతకం చేసి రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చారని తెలిపారు. ఒకవైపు ప్రజా సంక్షేమం మరోవైపు రాష్ట్రంలోని యువత నిరుద్యోగులకు ఉపాధి భద్రత అలాగే రాష్ట్ర అభివృద్ధికి ఒక విజన్తో పని చేస్తున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తెలుగు రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆయన చెప్పారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధితో దూసుకుపోతుందని తెలిపారు.

## ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఇన్నొవేషన్ ఎంతో అవసరం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఇన్నొవేషన్ ఎంతో అవసరమని మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ నగరాజ రామారావు అన్నారు. చంద్రగిరి మండలం, ఏ రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం "ఇన్నొవేటివ్ రీసెర్చ్ ఇన్ ఫార్మస్యూటికల్ సైన్సెస్, బయోసైన్సెస్ మరియు మెడికల్ సైన్సెస్ 2024" అని ఒక జాతీయ స్థాయి చర్చ సమావేశం నిర్వహించారు. ఈ చర్చ వేదిక అకాడెమియా మరియు ఇండస్ట్రీ మధ్య ఆరోగ్య శాస్త్రాల రంగంలో వున్న ఖాళీని పూరించటం అనే అంశంతో రెండు రోజులపాటు కొనసాగుతున్నది. ఈ ప్రతిష్టాత్మకమైన కాన్ఫరెన్స్ ను యుంబియులోని స్కూల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ నిర్వహించింది. ఈ సమావేశంలో నిప్పర్ హైదరాబాద్ నుంచి డాక్టర్ శ్రీనివాస్ నందూరి, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ నుంచి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేర్రీ, బయోకాన్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు నుంచి డాక్టర్ ప్రవీణ్ మరియు యంబియు రిజిస్ట్రార్ డాక్టర్ కె. సారధి, రీసెర్చ్ ఇన్నొవేషన్ డీన్ డాక్టర్ అవిరేనీ శ్రీనివాసులు, ఫండెడ్ రీసెర్చ్ డీన్ డాక్టర్ ఈశ్వర్ సుంకర, స్కూల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ మల్లికార్జున్ వంటి ప్రతిష్టాత్మకమైన వక్తలు ప్రారంభించారు కాన్ఫరెన్స్ సంబంధించిన సావెనీర్‌ను విడుదల చేశారు. ఫార్మాసూటికల్ రంగంలోని వారి నైపుణ్యం మరియు అవగాహన భవిష్యత్తు టెక్నాలజీ, ఇన్నొవేషన్‌పై ఆసక్తికరమైన చర్చల కోసం బాటలు వేశారు. కాన్ఫరెన్స్ మొదటి రోజు "డ్రగ్ డిస్కవరీ, జాతీయ, అంతర్జాతీయంగా జరుగుతున్న పురోగతులు" అనే ముఖ్యమైన ప్యానెల్ చర్చను నిర్వహించారు. ప్యానెలిస్టులు ఫార్మస్యూటికల్, మెడికల్ సైన్సెస్ రంగాలలో ఇన్నొవేషన్స్ ప్రాముఖ్యతను, వైద్య నైతికత అవసరాన్ని చర్చించారు. ఈ కాన్ఫరెన్స్ పరిశోధకులు, పండితులు పరిశ్రమ నిపుణులకు ఆలోచనలు మార్పిడి, ఆధునిక



టెక్నాలజీలను అన్వేషించడం ఫార్మస్యూటికల్, మెడికల్ సైన్సెస్ రంగాలలో ప్రభావ వంతమైన ఇన్నొవేషన్స్‌కు మార్గదర్శకం ఇవ్వటానికి అవకాశం కల్పించింది.

## ఎమ్మెల్యేలకు విలేకరుల సన్మానం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు జర్నలిస్టుగా విధులు నిర్వహించి ఏపీయూడబ్ల్యూజే లో దీర్ఘకాలికంగా ఉద్యమాలు నడిపించిన డాక్టర్ మురళీమోహన్ అన్న చిత్తూరు జిల్లా పూతలపట్టు శాసనసభ్యులుగా గెలుపొందారు. చిత్తూరుప్రెస్‌క్లబ్ ఏపీయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో మురళీమోహన్ అన్నను స్థానిక శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ నాయుడు తో కలిసి శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఘనంగా సన్మానం ఏర్పాటు చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను గొంతుక అవుతానని పాత్రికేయుల సమస్యలు ఎలాంటివైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తానని మురళి అన్న హామీ ఇచ్చారు. తన ఇంటికి వెళితే ఎలాంటి సంతోషం కలుగుతుందో చిత్తూరు ప్రెస్‌క్లబ్లో పాత్రికేయలను కలుసుకోవడం కూడా అంతే సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పాత్రికేయుల సంక్షేమానికి చిత్తూరు ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని, చిత్తూరు ఎమ్మెల్యే తన సోదరుడు, గురజాల జగన్ మోహన్ తో కలిసి పాత్రికేయుల సంక్షేమానికి కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాత్రికేయలంతా కలిసి మురళి అన్నను ఘనంగా సన్మానించడం జరిగింది. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ చిత్తూరు అభివృద్ధికి ప్రతి ఒక్క జర్నలిస్టు సహకరించాలని కోరారు. తన దృష్టికి రాకుండా ఏవైనా ఘటనలో జరిగితే ముందుగా తనకు చెబితే వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. తాము చేసే తప్పులను ఎత్తి బాధ్యత కూడా జర్నలిస్టులపైనే ఉందన్నారు. చిత్తూరు ప్రెస్ క్లబ్ భవనం అభివృద్ధిలో తన వంతు సహకారం తప్పనిసరిగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు జిల్లా కన్వీనర్ అండ్ చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎం.లోకనాథన్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, ప్రెస్ క్లబ్ కమిటీ ఉపాధ్యక్షుడు, మహేష్, జాయింట్ సెక్రెటరీషకీల్, ఐజేయు నెంబర్ మురళీకృష్ణ, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు దొరై, చంద్ర, మురళి, అయ్యప్ప, శివకుమార్, సీనియర్ పాత్రికేయులు సుభాష్ బాబు, కరీం, రమేష్, కాళేశ్వర్ రెడ్డి, వీర రాఘవులు, రామ్మూర్తి, ఈషార్ హమద్, రాజేంద్ర నాయుడు, జయప్రకాష్ నాయుడు, రామకృష్ణ, హరీష్, సురేందర్ రెడ్డి, విజయ్, రాజేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు ద్వారా ప్రజా పాలన వచ్చింది

### ఎన్నికల హామీలు నెరవేర్చబోతున్నాం... నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్ర రాష్ట్రంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ద్వారా ప్రజా పాలన వచ్చిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరబోతున్నాయని నగరి ఎమ్మెల్యే గాలి భాను



ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, పించందారులు గాలి భాను ప్రకాష్ ను కలిసి ఆయనకు స్వీట్లు తినిపించి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీలను వచ్చిన రెండు రోజులకే ఐదు సంతకాలు చేసి ప్రజాపాలనకు నాంది పలికారన్నారు. ఇకపై రానున్న రోజుల్లో మరింత ప్రజాపాలనందించడానికి ఆయన ముందుంటారని తెలిపారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ రిలీజ్ చేసి నిరుద్యోగ యువతను మభ్యపెట్టడానికి ప్రయత్నించిందని అయితే చంద్రబాబు వచ్చిన వెంటనే 16 వేల పైచిలుకు డీఎస్సీ పోస్టులపై మొదటి సంతకం చేయడం హర్షనీయమన్నారు. అలాగే పింఛన్దారులకు 3000 నుంచి 4000 రూపాయలు పెంచడంజరిగిందన్నారు. ప్రజల ఆస్తిని కబ్జా చేసుకునే విధంగా, ఆస్తులకు రక్షణ లేని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ను జగన్ మోహన్ రెడ్డి తీసుకుని వచ్చారు. అలాంటి దారుణమైన చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు రెండవ సంతకం చేశారన్నారు.

## సువర్ణ పాలనకు శుభారంభం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించడంతో సువర్ణ పాలనకు సుభారంభం అయిందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటీల తెలిపారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల మునుపు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను బాధ్యతలు చేపట్టిన తక్షణమే వాటిని



అమలు చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడంలో భాగంగా మొదటి సంతకం మెగా డీఎస్సీ పై చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రజా ఆస్తులకు భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండో సంతకం, సామాజిక పెన్షన్ రూ.3000ల నుంచి 4 వేల రూపాయలకు పెంచుతూ మరో సంతకం, నిరుద్యోగ యువతలో ఉన్న నైపుణ్యాన్ని విద్యా అర్హతలను కనుగొన ఉపాధి అవకాశం కల్పించడం కోసం నైపుణ్య గణన కోసం నాలుగో సంతకం, దినసరి కూలీలు, వృద్ధులు, పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ కోసం ఐదో సంతకం చేయడం జరిగిందన్నారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నమన్నారు.

## పేదలకు అన్నదానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లాజీ 57వ జన్మదినాన్ని పురస్కరించుకొని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని ఆ ట్రస్ట్ కార్యాలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. దీనికి ముందు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ డాకర్ పీసీ. రాయులు మాట్లాడుతూ పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లాజీ, వారి కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండేలా తిరుమల శ్రీవారు ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. వారి దగ్గర 37 దేశాలలో సుమారు లక్షా 80వేల మంది ఉద్యోగులు వివిధ బిర్లా సంస్థల్లో పని చేస్తున్నారని తెలిపారు. వారి పూర్వీకులు కూడా దేశ సేవ చశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ప్రతినిధులు బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, డాక్టర్ పి.రెడ్డెప్ప, సుబ్రమణ్యంరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో సినీ హీరో సాయి కుమార్ కుటుంబం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు తెలుగు చలనచిత్ర హీరో సాయికుమార్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తి స్వామి దేవస్థానానికి విచ్చేశారు వారిని ఆలయ ఏఈఓ సతీష్ మల్లి స్వాగతం పలికి ప్రత్యేక రాహు కేతు పూజ అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రత్యేక దర్శనం చేయించారు.శ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద ఆలయ అధికారులు సాయికుమార్ కుటుంబం సభ్యులను శేష వస్త్రంతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు వేద పండితులు వేదమంతురాలతో ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ సతీష్ మల్లి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్,టెంపుల్ సూపరింటెండెంట్, సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్, ఆలయ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అవినీతికి తావులేదు

## - ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న అధికారకంగా 5 సంక్షేమ పథకాలపై సంతకాలు పెట్టి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు, నివాళులర్పించారు. అనంతరం ఆర్టిసి సర్కిల్ వద్ద నందమూరి తారక రామారావు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం పీఆర్ గెస్ట్ హౌస్‌లో పురపాలక సంఘం, రెవెన్యూ, విద్యుత్, అధికారులతో రివ్యూ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి వస్తున్న నిధులను ఏ విధంగా అధికారులు ప్రజలకు పట్టణ అభివృద్ధికి, వినియోగిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొజ్జలసుధీర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారకంగా ఐదు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం చారిత్రాత్మకమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలని ఆదుకుంటూ, ప్రజా రంజకంగా పరిపాల కొనసాగిస్తుందన్నారు. తమ ముఖ్యమంత్రి అడుగుజాడల్లో తాను నడుస్తూ, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎక్కడ రౌడీయిజం ఉండకుండా అంతం చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో భూకబ్జాలు చేసిన వ్యక్తులపై తగిన విధమైన చర్యలు తీసుకొని, వారు భూకబ్జా చేసిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని, స్వాధీనం చేసుకున్న స్థలాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. అధికారులతో రివ్యూ నిర్వహించి, పురపాలక సంఘానికి వస్తున్న నిధులను ఏవిధంగా ప్రజలకు సేవలు అందిస్తు న్నారో పురపాలక సంఘం అధికారులను అడిగి తెలుసుకున్నమని, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత గల ప్రతి ఒక్క వ్యక్తికి చేరే విధంగా పురపాలక సంఘం అధికారులు కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించామని తెలియజేశారు. అవినీతి చేస్తే ఉపేక్షించానని తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి నియోజకవర్గం అన్ని డిపార్ట్మెంట్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# రాష్ట్రంలో సంక్షేమ చంద్రోదయం ప్రారంభం : ఎమ్మెల్యే ఆదిమూలం

**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథంలో రాష్ట్రంలో సంక్షేమ చంద్రోదయం ప్రారంభమైందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు స్వీకరించి,5 సంక్షేమ పథకాలపై తొలి సంతకాలు చేసిన నేపథ్యంలో శుక్రవారం నారాయణవనం మండలంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు,వృద్ధుల సమక్షంలో సంబరాలు నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం వృద్ధులకు,విద్యార్థులకు,నిరుద్యోగులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టి,శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం సేకరించిన వెంటనే రాష్ట్ర ప్రజల భవిత కోసం ఐదు ఫైళ్లపై తొలి సంతకం చేయడంతో రాష్ట్ర చరిత్రలో స్వర్ణ అధ్యాయం మొదలైంది అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీ పై చేసి 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ ఉపాధ్యాయుల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురానున్నారని తెలిపారు.రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు పై చేసి గత ప్రభుత్వం అన్యాయంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దుచేసి రైతులకు మేలు చేకూర్చాలని తెలిపారు.మూడో సంతకం అవ్వ తాతలు, దివ్యాంగుల పెన్షన్ల పెంపుపై చేసి దివ్యాంగులకు రూ.మూడు వేలు నుంచి రూ.నాలుగు వేలకు, దివ్యాంగులకు మూడు నుంచి 6000 కు పెంచి అభాగ్యులకు అండగా నిలబడ్డారని తెలిపారు.నిరుద్యోగ యువతలో నైపుణ్య స్థాయి లెక్కించేందుకు చేపట్టనున్న నైపుణ్య గణన కార్యక్రమం పై నాలుగో సంతకం చేసి, యువతి, యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు.పేదవాళ్లకు అన్నం పెట్టి ఆదుకోవాలని దిశగా గతంలో తీసుకొచ్చిన అన్న క్యాంటీన్లను,వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి మూసివేయగా,మళ్లీ దానిని పున ప్రారంభించాలని ఐదు సంతకం చేసి అన్నార్తులకు ఆదుకోనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మస్తాన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పరమశివం, బాలరాజు, వరలక్ష్మి యాదవ్, చిన్న,బాలమురళి తదితరులు పాల్గొన్నారు.



# పూతలపట్టు ఎమ్మెల్యేను కలిసిన కాణిపాకం ఆలయ ఈవో

**ఐరాల, మేజర్‌న్యూస్:** పూతలపట్టు నియోజక వర్గం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్‌ను శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరు నందు ఆయన నివాసంలో కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ. వెంకటేశు మర్యాదపూర్వకంగా కలసి అలయ వేదపండితులచే అశ్వరచన చేసిన అనంతరం ఆలయ ఈఓచేతులు మీదుగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయల ప్రధాన అర్చకులు ఎన్. సోమశేఖర్, ఎఇఓ విద్యాసాగర్ రెడ్డి, ఈఈ వెంక నారాయణ, తెలుగుదేశం పార్టీనాయకులు సురేంద్ర బాబు, (మణినాయుడు) హరిబాబు నాయుడు, వి. గిరిధర్ బాబు, కోళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి అచ్చెన్నాయుడుకు పలువురు అభినందనలు



**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర మంత్రివర్గంలో నూతన మంత్రిగా నియమితులైన అచ్చెన్నాయుడుకు తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టు కుంటూ ప్రజాపాలన మొదలు పెట్టారని చెప్పారు. కొలువుదీరిన మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ ఖాజా మొహిద్దిన్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో నూతనంగా కొలువు దిరిన మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు.



# నేను నియోజక వర్గం ప్రజల సేవకున్ని

**- పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్**
**- 15 రోజులకు ఒక్కసారి తాగునీరు ఇస్తున్నారని గ్రామస్తుల ద్వారా సమస్య విని చలించిన ఎమ్మెల్యే**
**- నిర్లక్ష్య ధోరణి వీడి ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశం**
**- సమస్య ఉంటే నాకే నేరుగా ఫోన్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే**

**ఐరాల, మేజర్ న్యూస్:** పూతలపట్టు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ కలికిరి మురళీమోహన్ గ్రామాల పర్యటనలు చేపట్టారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నారు. పూతలపట్టు మండల కేంద్రంకు సమీపంలోని పక్కాలగుట్ట గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తెలుసుకుని చలించి పోయారు. దీంతో గ్రామస్తులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత కొన్నేళ్ళుగా 15 రోజులకు ఓమారు మాత్రమే త్రాగునీరు అధికారులు విడుదల చేస్తున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులను పిలిపించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 15 రోజులకు ఒక్కసారి నీళ్లు విడుదల చేస్తే ప్రజలు ఎలా జీవనం సాగించాలంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకుల హయాంలో నడుచుకున్నట్లు వ్యవహరిస్తే కుదరదని అధికారులను హెచ్చరించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కంచాలని ఎలాంటి జ్యాప్యం ఉండరాదని సూచించారు. ఇక ఏదైనా సమస్య ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎంపిడిఓ, పంచాయతీ అధికారులు, ఆర్.డబ్ల్యూఎస్ అధికారులను వెంటబెట్టుకుని గ్రామానికి చేరుకుని అక్కడికక్కడే సమస్యకు పరిష్కారం చూపించారు. పక్కాలగుట్ట గ్రామం విషయంలో నిర్లక్ష్యం వహించిన పంచాయితీ కార్యదర్శిని పక్కన పెట్టి మరో కార్యదర్శి ద్వారా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళిమోహన్ ఎంపిడివోకు సూచించారు. గ్రామంలోని బోర్లు వెంటనే మరమ్మత్తు చేయాలని ఆదేశించారు. అప్పటి వరకు ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా ఇస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వెంటనే డబ్ల్యుఎస్ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఏదైనా సమస్యలు వస్తే వెంటనే నా మొబైల్ నంబర్ కు కాల్ చేయాలని ప్రజలను ఎమ్మెల్యే మురళిమోహన్ తెలిపారు. నేను మీ సేవకుడిని, మీకు నిత్యం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే మురళిమోహన్ అన్నారు.



## ట్రిబుల్ ఆర్ హెూటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు



**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రామ్ తులసి కళ్యాణ మండపం రోడ్డులో శుక్రవారం నూతన ట్రిబుల్ ఆర్ హెూటల్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఓవి రమణ, మంత్రిగా ఉండి రాజగోపాల్, ఎఏం రత్నం తదితరులు పాల్గొని ప్రారంభోత్సవంలో రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఎమ్మెల్యేను కలిసిన పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి



**పుత్తూరు, మేజర్ న్యూస్:** ఎమ్మెల్యే గాలిబాను ప్రకాష్‌ను పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యేని దుశ్శాలు వాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఆర్టీసీ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. అలాగే పుత్తూరు ఆర్యవైశ్య సంఘం తరపున సంఘ సభ్యులు కూడా ఎమ్మెల్యే భాను ప్రకాష్ ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుమలలో ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



**తిరుమల, మేజర్ న్యూస్:** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొత్తం 14 మంది భక్తులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో అశ్విని ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, హెడ్ నర్స్ సావిత్రి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన మీసేవ అసోసియేషన్



**రేణిగుంట, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీ కాళహస్తి నియోజకవర్గ మీసేవ కేంద్రాల అసోసియేషన్ సభ్యులు. శుక్రవారం కాళహస్తి లోని అయన నివాసంలో నివాసంలో కలిసి దుశాలవాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తేజ, సూర్య, కిరణ్ మధు లత కవిత తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జలను కలిసిన తెదేపా నేతలు



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాలలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసి 40 వేల పైచిలుకు అత్యధిక మెజారిటీతో నియోజకవర్గంలో విజయకేతనం ఎగరవేసిన బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు శ్రీకాళహ స్తిలోని వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి పూల బొకే అందించి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, వట్టికుండల శేఖర్ నాయుడు,వేలూరు హరి నాయుడు, సిద్దలయ్య నాయుడు,తాళ్ల యుగంధర్, రాపూరు పరుశురాం,మారాబత్తిన గురవయ్య, మునికుమార్ పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా జిల్లా వ్యాప్తం తనిఖీలలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ అధ్వర్యంలో హెూటల్స్, జనరల్ స్టోర్స్ , క్లాత్ షాప్స్, బేకరీలు, దాబాలలో వివిధ షాపులలో తనిఖీలు నిర్వహించి, షాప్ యజమానులకు బాల కార్మిక వ్యవస్థ చట్టాలపై అవగాహన కకల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి రంగనాథ్, సహాయ కార్మిక అధికారి, శ్రీకాళహస్తి, శ్రీమన్నారాయణ, రాజయ్య, హేమావారి, సహాయ కార్మిక అధికారులు, తిరుపతి, దేవాయాని , తిరుపతి ప్రభాకర్, ప్రగతి మండల కో ఆర్డినేటర్, శ్రీధర్, సర్వశిక్ష అభియాన తదితరులు పాల్గొన్నారు.



# ఎస్వీయులో నిరుద్యోగుల సంబరాలు



చంద్రబాబు, పవన్, లోకేష్ చిత్రపటాలకు పలాభిషేకం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రజా సంక్షేమ దశగా నవయుగ పరిపాలకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల ఆనంద వ్యక్తం చేస్తూ ఎస్వీ యూనివర్సిటీలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకే చిత్రపటాలకు నిరుద్యోగులతో కలిసి పలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, చిన్న, జీవీఎస్ శివశంకర్ నాయక్, టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆర్కే నాయుడు మాట్లాడుతూ నవ్యాంధ్రను ఉద్యోగా ఆంధ్రప్రదేశ్ గా మార్చారని శుభ పరిణామం అన్నారు. యువతకి ఉపాధి అవకాశాలు, ఉద్యోగులకు భరోసా భద్రతను కల్పించారన్నారు. ప్రజలకు అండగా నిలిచే నిర్ణయాలతో యావత్ ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇది రాష్ట్రానికి శుభ పరిమాణంగా చెప్పవచ్చని తెలియజేశారు. రాష్ట్ర చరిత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. నిరుద్యోగుల పక్షపాతిగా చరిత్రలో నిలుస్తారని విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, శ్రీరామ్ బషీర్, రామంజి, లక్ష్మన్న బీసన్న, గణేష్ సోమేశ్, పెద్దయ్య, వీరేష్, రవి పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

**- ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు పిలుపు**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడచ్చని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్



రక్తదానం చేస్తున్న ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్స్ సిబ్బంది

వైద్యులు పిలుపు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం శుక్రవారం రేణిగుంట రోడ్డు లోని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్లో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది రక్తదానం చేశారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సి.ఓ.ఓ డాక్టర్ శ్రీధర్ముని మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు 3 నెలలకు ఒకసారి రక్త దానం చేయడంతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడచ్చని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్త దానం చేయడంతో శరీరంలో కొత్త రక్తం ఏర్పడి తద్వారా మానవులు సంపూర్ణ కరమైన జీవితాన్ని పొందవచ్చున్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంలో ఆస్టర్ నారాయణాద్రి ఎల్లపుడు ముందుంటుందని మరో డైరెక్టర్ డాక్టర్ ఎస్ వి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని షిల్డ్ అందించి అభినందించారు. ఇందులో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సిబ్బంది, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎంలపై తప్పుడు ప్రచార తగదు

**- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిని మారుసాని గోవర్ధన్ రెడ్డి**



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** ఈవీఎంలపై తప్పుడు ప్రచారం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రికి తగదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిని మారుసాని గోవర్ధన్ రెడ్డి అన్నారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి మీడియాకు ఇచ్చిన సమాచారం మేరకు ఈవీఎం మిషన్లో శకుని మార్చికలో మాదిరిగా ఎటుపడమంటే అటు పడ్డాయని వ్యాఖ్యానించడం సరైనది కాదు ఎందుకంటే 2019 ఎన్నికలలో ఆరోజు నువ్వు ఎటుపడమంటాడు పడ్డాయా ఆ నిజ ఒప్పుకుంటే ఇది కూడా నిజం ఆ రోజు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఈవీఎం మిషన్లో రద్దు చేయాలని పిలుపునిచ్చినప్పుడు నీకు అనుకూలంగా జరిగింది కాబట్టి నువ్వు నిమ్మకున్నావా. ఈరోజు నీకు అనుకూలంగా జరగలేదు అని నిజాలు ఒప్పుకుంటున్నావా అదేవిధంగా మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కోట్లాదిమంది మన వెంట ఉండారు అని చెప్పడం వెనుక అంతర్యం ఏమిటి, కోట్లాది మంది ఉంటే ఈరోజు లక్షలాది ఓట్లతో కూటమి గెలవడం ఏంది ఇంకా రాజకీయ సానుభూతి కోసమే ప్రయత్నం చేస్తుం డగా తప్ప నిజాలు గ్రహించలేకపోతున్నావు,. ఈరోజు నీ ఓటమికి కారణం కూటమి మీద అభిమానంతో కాదు నీ మీద వ్యతిరేకమైనటువంటి ఓట్లే కూటమిని అధికారంలోకి తెచ్చాయి. నువ్వు ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చుని చదువుకొని వచ్చి ఈరోజు ప్రజా సమస్యలు ఉంటున్నావ్ అసలు ప్రజా సమస్యలనేది ప్రజల మధ్య బతికిన వాళ్లకు తెలియటం లేదు నువ్వు ఎక్కడో ఏసీ రూముల్లో వండుకొని ఎసి కాలేజీలో చదువుకొని వచ్చి నీకు ఎలా తెలుసు? ఎవడో చెప్పింది విన్నావు ఏమో చేశావు దానివల్ల జరిగింది అందరికీ నష్టమే గాని ఒకరైన సంతోషంగా లేరు కాబట్టి నీ మీద ఇంత వ్యతిరేకత వచ్చింది ఈ విషయం గ్రహించి ఇంకైనా రాజకీయాలకు స్వస్తి చెప్పి వ్యాపారం మీద దృష్టి సారి ఇచ్చామంటే ఆదాని అంబానీల కంటే ప్రపంచ కుబేరుడు కాగలవు ఆలోచించుకో జగన్.



## తిరుమలలో మొక్కు తీర్చుకొన్న టీడీపీ అభిమానులు

**కుప్పం, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో కుప్పం తెలుగుదేశం పార్టీ అభిమానులు తిరుమలలో మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ముద్దుబిడ్డ నారా చంద్రబాబునాయుడు కుప్పంలో అత్యధిక మెజారిటీతో గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రి అవ్వాలని ఎలక్షన్ కంటే 41 ముందుగా గోవింద మాలతో ఉండి 12వ తేది నారా చంద్రబాబునాయుడు విజయవాడలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అక్కడ నుంచి తిరుపతికి చేరుకొని మెట్ల మార్గంలో నడిచి వెళ్ళి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి తల నీలాలు అర్పించి మొక్కులు చెల్లించుకొన్నట్లు అభిలాష్ చిన్నా తదితరులు తెలిపారు.

## 29, 30 తేదీల్లో గ్రామ దేవత కోటమ్మ తల్లి జాతర



**కోట,(వాకాడు), మేజర్‌న్యూస్:** కోట గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీశ్రీ కోటమ్మతల్లి అమ్మవారి జాతర మహెూత్సవ వేడుకలు ఈనెల 29- 30 తేదీలలో అంగరంగ వైభవంగా జరుగు తాయని ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి పరివార దేవతామూర్తుల ఆలయాలకు రంగులు దిద్దుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతరను జరిపించేలా ఇప్పటికే ఏర్పాట్లుజరుగుతున్నాయి. ఈ నెల 29వ తేదీ ఉదయం 4 గంటలకు సముద్ర జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేపట్టనున్నారు. అలాగే సాయంత్రం 4 గంటలకు ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి,లక్ష్మీ కవితమ్మ దంపతుల చేతుల మీదుగా జగన్మోహన్ రెడ్డి నివాసం వద్ద నుంచి ఆలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వేడుకగా వెళ్ళి సరే చీర అమ్మవారికి అందించనున్నారు. 30వ తేదీ తెనాలి బ్యాండు, తప్పెట్లు, తాళాలు మంగళ వాయిద్యాలుబాణాసంచా వేడుకలతో కోటమ్మ తల్లి పరివార దేవతల నడుమ బ్రహ్మోత్సవంవైభవంగా జరగనుంది.

## రక్తదానం... వేరొకరికి ప్రాణదానం



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం సిఐటి యు ఆధ్వర్యంలో కామ్రేడ్ పర్సా సత్యనారాయణ శతజయంతిని పురస్కరించుకొని మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ య్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రక్తం మార్కెట్లో దొరికే వస్తువు కాదని ఒకరు రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేయగలమని అన్ని దానాలలో కల్లా రక్తదానం చాలా గొప్పదన్నారు. ప్రమాదాలలో అనుకోకుండా చిక్కుకొన్నవారికి మరియు ఇతర అనారోగ్యాలతో బాధపడే వారికి చాలా ఉపయోగకరమన్నారు. సమాజ సేవని దృష్టిలో ఉంచుకొని సి.ఐ.టి.యు ఇతర సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రక్త దాతలు నారాయణ జూనియర్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ జోగి హరీష్ కుమార్, ఆటో యూనియన్ కార్మికులు పట్టణ కమిటి తరఫున కె.శశి కుమార్, వై.కిషోర్, జె.కళ్యాణ్, కె.పాండు, సి.హెచ్. శ్రీకాంత్‌లు రక్తం డొనేటెడ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సిఐటియు ప్రధాన కార్యదర్శి వైస్.సురేష్, కార్యదర్శి పి. శ్రీనివాసులు, ఆటో యూనియన్ పట్టణ సహాయ కార్యదర్శి బి. రమేష్, అడపాల ప్రసాద్, జి.మధు, బి.చంద్రయ్య, గుర్రం. రమణయ్య ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ మధుసూదన్, వై.మనోజ్, స్టాఫ్ నర్స్ మార్తా కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల అంగన్వాడీ బడి బాట



**గూడూరు, మేజర్‌న్యూస్ :** చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం గ్రామంలో అంగన్వాడీ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ తిక్కవరం సెక్టార్ సూపర్వైజర్ రేణుకమ్మ మాట్లాడుతూ బడి ఈడు (అంగన్వాడీ) చిన్నారులన విధిగా బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీ లో పౌష్టికాహారం తోపాటు ఆటలు పాటలతో కూడిన బోధన చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్నారులు తల్లులతో ర్యాలీ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## రక్తదాతలుగా మారండి



**కార్వేటి నగరం: మేజర్ న్యూస్:** కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ విభాగముల ఆధ్వర్యంలో, స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వారి సహకా రంతో "ప్రపంచ రక్తదాతల దినోత్సవం" జరిగింది. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారి ప్రపంచాన్ని ఆరోగ్యవంతమైన ప్రదేశంగా మార్చడంలో సహాయపడండి అని పిలుపునిచ్చారు. కార్వేటి నగరము కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ శాస్త్ర చికిత్సలు, ప్రసవం, క్యాన్సర్ చికిత్సలు, ప్రమాద బాధితులకు అత్యవసర సంరక్షణ వంటి అనేక రకాల వైద్య విధానాలకు రక్తదానం చాలా కీలకము అని తెలియజేశారు. ఒక దేశ జనాభాలో కనీసం 1% రక్తదానం చేయడము సాధారణంగా సురక్షితమైన రక్తం కోసం ఆ దేశం యొక్క ప్రాథమిక అవసరాలను తీర్చడానికి సరిపోతుందని డబ్ల్యుహెచ్వో సిఫార్సు చేసిందని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ స్నేహితులను కుటుంబ సభ్యులను సాధారణ రక్తదాతలుగా ప్రోత్సహించి ఏడాది పొడవునా రక్తాన్ని అందించండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఆర్థోపెడిషియన్ డాక్టర్ లక్ష్మీపతి. వైద్య సిబ్బంది అంబారీష్, కళాశాల అధ్యాపకులు ఎస్ కార్తీక్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



**ఎస్ఆర్‌పురం, మేజర్‌న్యూస్:** గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గంగమ్మ గుడి వద్ద చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు గంగమ్మ గుడి కి చెందిన సావిత్రి (65) శుక్రవారం ఉదయం వాకింగ్ వెళుండగా చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి గంగమ్మ గుడి మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కుల్లాయప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# నాయుడుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయండి



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** నాయుడుపేట రైల్వే స్టేషన్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని స్థానిక బిజెపి నాయకులు అన్నారు. శుక్రవారం వారు నాయుడుపేట రైల్వే స్టేషన్ రైల్వే మేనేజర్ చిరంజీవి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు నాయుడుపేట రైల్వే మేనేజర్ చిరంజీవికి శాలువాలు కప్పి సన్మానించారు. భారతదేశంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా నాయుడుపేట రైల్వే స్టేషన్లో డిస్ప్లే ఏర్పాటు చేశామని తెలిపారు. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించడంతోపాటు స్వచ్ఛమైన త్రాగునీరు, వికలాంగులకు వీల్ చైర్, ఒకటో నెంబర్ ప్లాట్ఫారం నుంచి రెండో నెంబర్‌కి ప్లాట్ ఫారం వెళ్లడానికి ప్లాట్ ఫారం చివర భాగాన ఒక ర్యాంపును ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. అలాగే హైదరాబాద్ నుంచి బయలుదేరిన హైదరాబాద్ ఎక్స్ప్రెస్ ప్రస్తుతం నాయుడుపేటలో స్టాపింగ్ కల్పించాలని, బిట్రగుంట ఫాస్ట్ పాసింజర్ని పునరుద్ధించాలని కోరారు. నాయుడుపేట రైల్వే అభివృద్ధికి సహాయ సహకారాలు అందించినటువంటి కేంద్ర రైల్వే మాజీ మంత్రి అశ్విని వైష్ణవ, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డిదయాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు చిగురాకుల సురేంద్రబాబు,నాయుడుపేట పట్టణ బిజెపి అధ్యక్షులు పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి,జిల్లా మాజీ కార్యదర్శి ఆశా చెంచు కృష్ణయ్య, సీనియర్ బిజెపి నాయకులు అమరావతి రామయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు గాథం శెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ బిజెపి నాయకులు కోపోలు సుబ్రమణ్యం, పెళ్లకూరు మండల బిజెపి అధ్యక్షులు మురళి, బీసీ మోర్చా అధ్యక్షులు పెళ్లకూరు చంద్రశేఖర్, యువమోర్చ అధ్యక్షులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వారిని పలువురు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపి విరామ సమయంలో టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్., జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ లు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు



వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల కూన రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ పరదాల చాటున సాగిన పాలనను దించి ప్రజాపాలనకు అధికారం ప్రజలు ఇచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించానని తెలిపారు. నబూతో నా భవిషత్ అనే రీతిలో చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ పై సంతకం పెట్టారని తెలిపారు. పేదల ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్ లను ప్రారంభిస్తామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ చంద్రబాబు సంతకం పెట్టారని పేర్కొన్నారు. జూలై నెల నుంచే 4 వేల రూపాయల పింఛన్ ఇవనున్నామని తెలిపారు. పింఛన్ దారులలు బకాయిలతో కలిపి 7 వేల రూపాయలు పింఛన్ ఇస్తామని తెలియజేశారు.

# హామీలు నెరవేర్చిన సీఎం చంద్రబాబు నాయుడు

### టీడీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్

**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ పెన్షన్ పెంపు అన్నా క్యాంటీన్లు ల్యాండ్ టైటిల్ రద్దు అమలు చేస్తూ సంతకం చేశారని గూడూరు పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు వృద్ధులు, దివ్యాంగులకుతో పెన్షన్ల పెంపును తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు స్వీట్లు పంచిపెట్టారు. పెన్షన్ల పెంపుపై దివ్యాంగులు వృద్ధులు తమ సంతోషాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు అఖండ మెజారిటీతో టిడిపిని గెలిపించారని అన్నారు.



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐదు పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకాలు చేశారని పేర్కొన్నారు. మరికొన్ని పథకాలు త్వరలో అమలు చేస్తారని తెలిపారు .ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, ఇజ్రాయిల్, లీలావతి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో రక్తదాన శిబిరం

**నాయుడుపేట, మేజర్ న్యూస్:** కామ్రేడ్ పరసా సత్యనారాయణ శత జయంతి, ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా నాయుడుపేట సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు మహేష్ బాబు,కార్యదర్శి శివకవి ముకుందా మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడంతో సమానం అన్నారు.మన దేశంలో




కార్మిక శ్రమజీవులు శ్రమ చేసే సందర్భంలో ప్రమాదాలు జరిగినపుడు రక్తం అందుబాటులో లేక అనేక ప్రాణాలు పోతున్నాయన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తమ వారికి రక్తం దొరకక ప్రజలు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల నుండి రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు కొంత మేరకు శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రక్త దానం చేసినవారు ఒక్క రోజు స్పెషల్ లీవ్ తీసుకోవచ్చు అనే నిబంధన ఉన్నా అవి అమలుకు నోచుకోవడంలేదన్నారు. ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకుని గ్రామ స్థాయిలో ఎక్కువ శిబిరాలు నిర్వహించి రక్తదానంపై అవగాహన కల్పించినప్పుడే ప్రజలకు అనుకున్నంత మోతాదులో రక్తం దొరుకుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో అమ్మ ఫౌండేషన్ కు చెందిన కొందరు యువకులు రక్తదానం చేశారని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 30 మంది దాతలు రక్త దానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రతాప్, కుమార్, మోహన్, ఉదయ్ పాల్గొన్నారు.

# భూ హక్కు చట్టం రద్దుతో ప్రజల ఆస్థులకు రక్షణ

**: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ హక్కు చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రద్దు చేసి ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయడంతో శుక్రవారం టౌన్ క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి న్యాయవాదులు పలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు న్యాయవాదులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కు అభినందనలు తెలుపుతూ నినాదాలుచేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేయడం సంతోషమన్నారు. జనసేనఅధినేత పవన్ కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడులు ఎన్నికల్లో భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి హామీల పట్ల తమ నిబద్ధతను నిరూపించుకున్నారని చెప్పారు. తమ స్థిరాస్థులకు ఎలాంటి భంగం వాటిల్ల దనే నమ్మకన్ని ప్రజలలో కలిగించారని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంతో ప్రజలకు కోర్టు మెట్లు ఎక్కే అవకాశం కూడా లేక పోవడంతో న్యాయవాదులు ముందుండి ఆందోళన నిర్వహించడంతో ఈ చట్టం రద్దు సాధ్యమైందని చెప్పారు.

**ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు హర్షనీయం**

మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిల్ యాక్టను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రద్దు చేయడం హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. ల్యాండ్‌టైటిల్ యాక్టివ్ రద్దు చేస్తూ ముఖ్యమంత్రి రెండవ సంతకం చేయడంతో శుక్రవారం ఎన్టీఆర్ కూడలిలో నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద న్యాయవాదుల సమక్షంలో గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను చించి జై బాబు జై జై బాబు అంటూ నినాదాలు చేశారు. సుగుణమ్మ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రైతులను మోసం చేసి వారి భూమిపై హక్కు లేకుండా జగన్ కుట్రపన్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యక్ట్ రద్దు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన నారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై రెండవ సంతకం చేయడం రైతులకు మేలు చేకూరుతుందన్నారు. అలాగే న్యాయవాదులు సుగుణమ్మను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోషియేషన్ అధ్యక్షులు గోపిచంద్, టిడిపి రాష్ట్రజనరల్ సెక్రెటరీ, వెంకటరమణ, న్యాయవాదులు వేణుగోపాల్, వసుమతి, బాలకృష్ణమ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, సీనియర్ నాయకులు వూకా విజయ్‌కుమార్, రమణ, వట్టికుంట శంకర్నారాయణ, నైనారు మహేష్ యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**కలెక్టర్ ప్రవీణ్ కుమార్**

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్ నందు వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో పనులలో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్ లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల విషయాలు తదితర పలు అంశాలపై విసిఐసి, రెవెన్యూ, నేషనల్ హైవేస్ పిడి, ఆర్ అండ్ బి తదితర శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించి కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సదరు అంశాలపై అధికారులు దృష్టి పెట్టి త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పీడీ ఎన్హెచ్ఎఐ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, జిల్లా ఆర్ అండ్ బి అధికారి మధుసూదన్ రావు, ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, తిరుపతి స్పెషల్ ప్రాజెక్ట్స్ జోన్ జడ్ ఎం, నెల్లూరు విజయరత్నం, డిప్యూటీ జడ్ఎం చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.



# వరసిద్దుని సేవలో సినీ హీరో సాయి ధర్మతేజ్

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని శుక్రవారం ఉదయం సినీ హీరో సాయి ధర్మతేజ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ సంప్రదాయ ప్రకారం ఆలయ సూపర్‌డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్ స్పెక్టర్ రమేష్‌లు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించిన అనంతరం వారికి అశ్వరచన మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందజేసి, స్వామి వారితీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.



# అన్నా క్యాంటీన్ పునః ప్రారంభానికి చర్యలు

**పరిశీలించిన కమిషనర్ డా. జె అరుణ**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలోని స్థానిక



కొంగారెడ్డిపల్లె వద్ద అన్నా క్యాంటీన్ ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ డా. జె.అరుణ అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్ పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కోరడంతో నగర కమిషనర్ డా. జె అరుణ శుక్రవారం సాయంత్రం అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. క్యాంటీన్ పునః ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పనులను సత్వరం ప్రారంభించాలని, క్యాంటీన్ పూర్తిస్థాయిలో నిర్వహణకు అవసరమైన అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పునః ప్రారంభానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

# బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో రెండవ ప్రముఖ శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయంలో సాంప్రదాయబద్ధంగా రాహుకాల అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి పేర్కొన్నారు. శుక్రవారం



అమ్మవారి ఆలయంలో రాహుకాల అభిషేకాలు జరిగాయి. రాహుకాల అభిషేకాలు నిర్వహిస్తే తమకు మేలు జరుగుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు. అదేవిధంగా బోయకొండ గంగమ్మ వారిని దర్శించుకోవడానికి ప్రతిరోజు సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలి వస్తుంటారని,వారికి సులభంగా అమ్మవారి దర్శనం, మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి చంద్రమౌలి, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

**ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు**

**చిత్తూరుకార్పొరేషన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిత్తూరు ఆర్‌అండ్‌బి అతిథి భవనం సమావేశ మందిరంలో నగరపాలక కమిషనర్ డా. జె.అరుణతో కలిసి నగరపాలక సంస్థ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కమిషనర్ ఎమ్మెల్యేకు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. శాఖల అధికారులను పరిచయం చేశారు. ఎమ్మెల్యే నగరపాలకసంస్థ పరిధిలోని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. చిత్తూరు నగరాభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, అధికారుల సైతం సమన్వయంతో పనిచేయాలన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థను ఉత్తమంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డా. అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.



జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## మంత్రి సవితకు తెలుగు యువత అభినందనలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నూతన మంత్రివర్గంలో కొలువైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత కు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్య దర్శి రాగల ఆనంద్ గౌడ్ శుభాకాం క్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవా రం అమరావతిలో మంత్రిని కలసి శాలువ, జ్ఞాపకతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈయన



తోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బ్రహ్మం చౌదరి మంత్రి సవితను కలిసి శాలువుతో సత్కరికి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాలను తీవ్ర అణిచివేతకు గురయ్యారన్నారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు, బీసీల నిధులు గత ప్రభుత్వంలో భారీగా దుర్వినియోగం అయ్యాయని, నిధులు దుర్వినియోగంపై విచరణ చేపట్టాలని కోరారు. అలాగే బీసీ రక్షణ చట్టం అమలు చేయడం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కే రామ్మోహన్, వేణుగోపాల్, శివ గౌడ్ పాల్గొన్నారు.

## ముచ్చివోలు పాండురంగ స్వామి అగ్నిగుండం కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్



**శ్రీకాళహస్తి రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని ముచ్చివోలు గ్రామంలో శ్రీ పాండురంగ స్వామి దేవస్థానము పండరీ భజన బృందం ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి వార్ల 64వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆనంద అగ్నిగుండ ప్రవేశ మహోత్సవ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులుని శ్రీ పాండురంగస్వామి దేవస్థానము పండరీ భజన బృందం కమిటీ సభ్యులు ముచ్చివోలు గ్రామం పెద్దలు ఆహ్వాన పత్రిక అందజేశారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** సి.డి కండ్రిగ ఉమ్మడి పంచాయతీ టీ.కే.ఎం పేటకు చెందిన కీర్తిశేషులు ఆకుల సుబ్రహ్మణ్యం 19వ వర్ధంతి సందర్భంగా అతని కుమార్తె సి.డి కండ్రిగ సర్పంచి ఆకుల మంగమ్మ, ఆకుల గోపి ఆధ్వర్యంలో రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం పండ్లు స్వీట్ ఏర్పాటు చేయడం జరిగినది. కీర్తిశేషులు ఆకుల సుబ్రహ్మణ్యం సిడి కండ్రిగ పంచాయతీలో 32 సంవత్సరాలు సర్పంచ్‌గా ఉండి వినలేని సేవ కార్యక్రమాలు అందించడం జరిగినది ప్రతి ఏట ఇతని జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం జరుగుతున్నది .వృధాశ్రమ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వీరు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి రెడ్డి, వెంకటేశులు శెట్టి, ముని మండడి, రాజారాం మండడి, మురళి, వృద్ధులు గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

## ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలో వెలిసిన ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరి బాబు, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంకాల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ డైట్ సమీపంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయంలో ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు . మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మహిళలు అర్చకులు జగదీష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆరణికి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతల సత్కారం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ అధ్యక్షులు ఎస్ సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరీక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం అందుబాటులో ఉండి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ కార్యదర్శి బాలాజీ, కోశాధికారి శ్రీనివాసులు, రఘు, చెన్నకేశవులు నరేష్, నిమ్మల, రమణ, హరికృష్ణ, పెన్షనర్స్ అసోసియేషన్ జమాల్ వల్లి పాల్గొన్నారు.

# రక్తదానం మరొకదానానికి దోహదం : ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేయడంతో మరొకరి ప్రాణం కాపాడేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుశ్రీహరి ఆధ్వర్యంలో మానస సరోవర హొటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తదానం వల్ల మానవ హృదయానికి ప్రయోజనకరమని, ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి పెంచుతుందని, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, కొలెస్ట్రాల్ స్థాయి తక్కువలో ఉంచుతుంద న్నారు. రక్తదానం వల్ల దాతకు మానసికంగా పునర్జన్మను కలిగిస్తుందని తెలి పారు. రక్తదానం చేయడం వల్ల ఇన్ని ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ అపోహలు వీరి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంకు స్థాపించి ఎంతోమంది ప్రాణాలు నిలిపారని, ఆయన స్పూర్తితో యువకులు రక్తదానం చెయ్య డానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళా శాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సుపేరింటెండెంట్ రవి ప్రభు, ప్రసూతి వైద్యాశాల సుపేరింటెండెంట్ పార్థసారధి రెడ్డి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ శ్రీనివాసులు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి నైనారు మహేష్ యాదవ్, నాయకులు కాయం వెంకటరత్నం, వెంకట్ రాయల్, గుణశేఖర్ నాయుడు, జయ కుమార్, జనసేన నాయకులు కొండ రాజమోహన్, బండ్ల లక్ష్మీపతి రాయల్, చక్రాల సురేష్ రాయల్, ఆనంద్ రాయల్, పురుషోత్తం, రాధాదేవి, కార్పొరేషన్ హెల్త్ అధికారి యువ అన్వేష్ రెడ్డి, మాస్ మీడియా అధికారి బాబు నెహ్రు రెడ్డి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.





# సంపద సృష్టికర్త నవ్యాంధ్ర నిర్మాత సీఎం నారా చంద్రబాబు నాయుడు

**- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** అపర చాణిక్యుడు సంపద సృష్టికర్త నవ్యాంధ్ర రూపశిల్పి అమరావతి నిర్మాణ కర్త సైబరాబాద్ అభివృద్ధి ప్రదాత ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభంజనం సృష్టించడంలో నారా చంద్రబాబు నాయుడు కృషి ఎనలేనిదని కొనిఆడారు. ఆయన హయాంలోని రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సీఎంగా ప్రమాణం శ్రీకారం చేసి సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజు మొదటి మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, పెన్షన్ దారులకు రూ.3 వేల నుంచి రూ. 4 వేలు పెంచడం, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదవానికి కడుపునిండా అన్నం పెట్టే అన్న క్యాంటీన్ల ప్రారంభం, ప్రతి విద్యార్థిని విద్యార్థులు వృత్తిలో నైపుణ్యతను సాధించే దిశగా ఐదు రకాల సంక్షేమ పథకాలపై చంద్రబాబు తొలి సంతకాలు చేయడం పై రాష్ట్ర ప్రజ లు హర్షిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరపున వర్షం వ్యక్తం చేస్తున్నామని గురవారెడ్డి అన్నారు నిరుఉద్యోగ ఉపాధ్యాయుల కొరకు మెగా డిఎస్సి ని ద్వారా పోస్టు ఇచ్చే విధంగా మొదటి సంతకాన్ని చంద్రబాబు నాయుడు చేయడం గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నందమూరి తారక రామారావు చంద్రబాబునాయుడు 11డీఎస్సీఏర్పాటు చేసి వాటి ద్వారా లక్షలాది మంది ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తెలుగుదేశం ది చంద్రబాబు నాయుడుది ఎన్టి రామారావుది అన్నారు గత ఐదేళ్లపాటు ఉపాధ్యాయ ఉద్యోగాల్ని భర్తీ చేయనటువంటి దగా చేసినటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు గతంలో 2014 ముందు 200 ఉన్న పింఛన్ ను వెయ్యి రూపాయలు చేసి తర్వాత 19 లో 2000 చేసిన ఘనత చంద్రబాబు నాయుడు అన్నారు మరి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చే ముందు పాదయాత్రలో 3 వేల రూపాయలు చేస్తానని మాట ఇచ్చి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాల కాలం తీసుకున్నటువంటి ఒక దుర్మార్గ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తి అని కూల్చివేతలతో అక్రమ కేసులతో రాష్ట్రాన్ని 30 సంవత్సరాలు వెనక్కి పంపినటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు ఈరోజు చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలకు చర్మకారులకు డప్పు కళాకారులకు హిజ్రాలకు 3000 ఉన్న పింఛన్ 4000 చేస్తూ ఎన్నికల ముందే ఏప్రిల్ మాసం నుంచి వారికి ఏప్రిల్ మే జూన్ నెలలో కలిపి 3000 జోడించి జూలై మొదటి రోజే 7000 అందజేస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుది అన్నారు అంతేకాకుండా వికలాంగులకు 3000 ఉన్న పింఛన్ ని 6000 చేస్తూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 5000 వినిపించను 10000 వేలకు పెంచుతూ దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు మంచానికే పరిమితమైన వారికి 15 వేల రూపాయలు విచ్చే విధంగా ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మొదటి సంతకం చేసి ఆ కుటుంబాల్లో ఒక పెద్ద బిడ్డ ఉండి ఎన్టీఆర్ పేరుతోభరోసా కల్పించిన పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడే నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు కుమారు రాష్ట్రంలో 65 లక్షల పైచిలుకు పింఛన్లను ప్రభుత్వం అందిస్తోంది ఈరోజు పింఛన్లకే రాష్ట్రంలో ఇబ్బందులు ఉన్న ఒక దుర్మార్గుడు పరిపాలనలో రాష్ట్రం వెనక్కి పోయిన ఆర్థికంగా బాగా లేకపోయినా ఇచ్చిన మాట కోసం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నటువంటి పేద ప్రజల నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు గురవా రెడ్డి మాట్లాడుతూ. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు వ్యతిరేక పాలనలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ని రాష్ట్రంలో కబ్జా చేయడానికి జగన్ మోహన్ రెడ్డి తీసుకొస్తే దాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీమేరకు రాష్ట్రం లోని రైతాంగం కొరకు చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ని రద్దు చేయడంపై రెండో సంతకం చేయడం రైతుల పాలిట వరంగా ఈరోజు రాష్ట్ర రైతాంగం భావిస్తున్నారని రైతు బాంధవుడు చంద్రబాబు నాయుడు అన్నారు రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఈరోజు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యముతో సూపర్ సిక్స్ హామీలను మేనిఫెస్టోలో పెట్టి లోకేష్ యువ గళం స్పూర్తితో లక్షలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యముతో వారి నైపుణ్యాన్ని కల్పించి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఒక పథకాన్ని తీసుకువచ్చి ఈరోజు సంతకం చేసి యువతకు మార్గదర్శకుడు చంద్రబాబునాయుడు అన్నారు అదేవిధంగా పేదలకు అన్నా క్యాంటీన్ ద్వారా 14 నుంచి 19 వరకు రుచికరమైన భోజనాన్ని ?5కే చంద్రబాబునాయుడు అందిస్తే ఆ యొక్క పథకాన్ని 19 అధికారంలోకి వచ్చిన రివర్స్ ముఖ్యమంత్రి సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రద్దు చేయడం జరిగింది దానిపై చంద్రబాబు నాయుడు గారు అన్నా క్యాంటీన్ ఓపెన్ చేస్తూ ఐదు రూపాయలకే పేద ప్రజలకు రుచికరమైన భోజనాన్ని అందించే విధంగా సంతకం చేసి పేదల పాలిట పెన్నిధిగా చంద్రబాబునాయుడు ఈరోజు ఆ నిర్ణయం తీసుకోవడానికి తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజల తరపున వర్షం వ్యక్తం చేస్తున్నాం పేద ప్రజల సంక్షేమంకు ఈరోజు 5 సంతకాలు చేసి సంపద సృష్టించి రాష్ట్ర ప్రజలకు ఒక స్వపరిపాలని ఒక మంచి చేయాలని సంకల్పంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు మరి ఎక్కడ కక్ష సాధింపు చేయకుండా గత ప్రభుత్వంలో తప్పులు చేసినటువంటి వారిని చట్ట ప్రకారం శిక్షించాలని వారు నిర్ణయం తీసుకోవడం ఇది ప్రజాస్వామ్యానికే తల మాణికం ఒక మంచి సంప్రదాయం ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించడం దీర్ఘకాల రాజకీయాల్లో సుమారు 45 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా జాతీయ స్థాయిలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన పాత్ర పోషించినటువంటి జాతి సంపద అయినటువంటి నాయకుడు చంద్రబాబునాయుడుకి సాటి అని గురవారెడ్డి అన్నారు అదేవిధంగా నేను ముఖ్యమంత్రి అయ్యింది హోదాల కోసం కాదు ఈ ముఖ్యమంత్రి పదవి ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి ఉపయోగించుకోవడం తప్ప మీలో ఒకడిని అని అనడం వారి నిరానంబరుతకు వారి ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనం అదేవిధంగా పరదాలు కట్టే కట్టే గత ప్రభుత్వానికి భిన్నంగా ఇటువంటి పరదాలు రాష్ట్రంలో నా పర్యటనలు ఉండకూడదని అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలను సడలించాలని వారు ప్రభుత్వ అధికారులు ఆదేశాలు ఇవ్వడం వారి యొక్క పరిపాలన దక్షతకు నిదర్శనం అన్నారు.

## యోగాకి పేర్లు నమోదు చేసుకోండి

.-ఆదిశంకర కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య



**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గూడూరు ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాలలో పదివేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అలాగే పలు రంగాల్లో రాణించిన మహిళలకు శ్రీ శక్తి అవార్డులు ప్రదానం చేస్తామని ఆదిశంకర కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల మరియు మహర్షి వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పదివేల మంది విద్యార్థులచే యోగా విన్యాస కార్యక్రమం యోగిక్ ఫ్లయింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఆదిశంకర శ్రీ శక్తి అవార్డులు అందిస్తున్నామని యోగా కార్యక్రమంలో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో శేఖర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## ఉమారాజేశ్వరికి డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని బి.ఉమారాజేశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ విభాగానికి చెందిన ఆచార్యులు ఎస్ జ్యోత్స్నరాణి పర్యవేక్షణలో " డిజైన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ నావెల్ తెరాప్యూటిక్ ఏజెంట్స్ ఫ్రమ్ నేచురల్ ఆరిజిన్ టు టార్గెట్ జాంతిన్ ఆక్సిడోరిడక్టేస్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే భాను ప్రకాష్‌ను కలిసిన తహశీల్దార్



**పుత్తూరు, మేజర్ న్యూస్:** నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను పుత్తూరు తహశీల్దారు కె. శ్రీనివాస గౌడ్ డిప్యూటీ తహసీల్దారు ఎం సురేష్, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎఎస్ఓ మునికృష్ణయ్య, ఆర్ఐ జి గురుస్వామి, విఆర్ఓలు ఉన్నారు.

## కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న నాయీబ్రాహ్మణులు



**కుప్పం, మేజర్‌న్యూస్:** పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసినందుకు శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, 100 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పి.ఎస్. మునిరత్నం, శాంతారాం, లక్ష్మీ దివాకర్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడ్డ సంచులను వాడండి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి వ్యవసాయి మార్కెట్ యార్డ్ లో శుక్రవారం నిర్వహించు వారపు సంతలో గుడ్డ సంచులు వాడకం ప్లాస్టిక్ కవర్ల నిషేధం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్గదర్శి సంస్థ ఆధ్వర్యంలో సంతకు వచ్చిన మహిళలకు, పురుషులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు, ఇకపైన ప్రతి వారం గుడ్డ సంచులు పంపిణీ చేస్తారని వారు తెలిపారు .ఈ కార్యక్రమం నందు సంస్థ డైరెక్టర్ రుద్ర శేఖర్ రెడ్డి, ఏపీఓ కృష్ణయ్య, అక్బర్, పాండు, దిలీప్ సాయి పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో పరకామణి

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పరకామణి నిర్వహించినట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. పరకామణిలో 2, 15990 వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు కి సన్మానం



తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ : ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రఘురామకృష్ణ రాజును జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఓ ప్రైవేటు హెూటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన జనసేన నాయకులు ఆహ్వానం మేరకు అర్బన్ హాట్ లో ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు ను గజమాల, శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం భారీ కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నెలవాయు మురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు శ్రీవారి ఆశీస్సులతో మళ్లీ స్పీకర్ పదవిని చేపట్టాలని ఆకాంకించారు. ఈ కార్యక్రమంలో వినోద్, కుమార్, నెహ్రూ రాజు, లవ కుమార్, వినుకొండ బాబు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

## పవన్ పోరాటంతోనే విజయం సాధించాం

- ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలది
- కేక్ కట్ చేసి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపిన కిరణ్ రాయల్



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అరాచక పాలన పై అలుపెరగని పోరాటంతోనే విజయం సాధించామని, నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ అని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్ రాయల్ తెలిపారు. శుక్రవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ కేకులు కట్ చేసి నాయకులకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడిగా పవన్ కళ్యాణ్ అలుపెరుగని పోరాటం చేసి నేడు కూటమి భారీ మెజారిటీతో అత్యధిక సీట్లను సాధించి ఉప ముఖ్యమంత్రి స్థానాన్ని సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్ మరో ఉన్నత పదవిని తప్పక అధిరోహిస్తారని ఆశిస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ కూడా మంత్రి పదవి చేసిన తరువాతే ముఖ్యమంత్రిగా అయ్యారని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఈవీఎంలను తప్పుబడుతున్నారని, గత ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకున్న వైసిపి, నేడు కూటమికి 164 సీట్లు రావడంతో ఈవీఎంలపై నేపాన్ని నెట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నాలు చేయడం మానుకోవాలన్నారు. మాజీ సీఎం జగన్ కాదు చేసేది ఓదార్పు యాత్ర మేము ప్రజా ఓదార్పు యాత్ర పేరుతో జగన్ ఓదార్చడానికి కూటమి నాయకులు వెళ్తామన్నారు. తిరుమలలో విచ్చలవిడిగా అక్రమంగా తట్టలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని, తిరుమలనుంచే ప్రక్షాళన మొదలు పెడతానని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షనీయమన్నారు. టిటిడి విభాగాల్లో జరిగిన అవినీతిని మొత్తం విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తప్పక తీసుకుంటామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎంతటి ఉన్నత అధికారులునైనా అవినీతి విచారణలో వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆడుదాం ఆంధ్ర ఈవెంట్ ద్వారా మంత్రి రోజా 100 కోట్ల మేర దోచుకున్నారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకునేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిని, హేమ కుమార్, మునస్వామి, హేమంత్, కిషోర్, సుమన్ పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ నందు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు 70 మందికి పైగా రక్తదానంచేశారు. సామాజిక సేవలో పాల్గొనే బెస్త తరుణ్ తన మిత్ర బృందంతో కలిసి రక్తదానం చేశారు శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ విజయలక్ష్మి యువతలో రక్తదాన పై అవగాహన కల్పించి రక్తదానాన్ని ఇప్పించడానికి తీసుకువచ్చిన యువతను ప్రోత్సహిస్తూ తరుణ్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి రక్తదాన ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ, షాజిద, ఉమాదేవి, హెల్పింగ్ హార్ట్స్ మిత్ర బృందం పాల్గొన్నారు.

**సీఐటీయూ రక్తదాన శిబిరం:** ప్రపంచ రక్తదాన దినోత్సవం, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిఐటియు దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య అన్నారు. సుమారు 20 మంది సిఐటియు కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రెడ్డిపల్లి సురేష్, నాగరాజు, అన్వర్ బాషా, రాజా పాల్గొన్నారు.

## తిరుపతి ఎమ్మెల్యేని కలిసిన టిడిపి నాయకులు



**పలమనేరు మేజర్‌న్యూస్:** తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వగృహమునందు పలమనేరు పట్టణానికి చెందిన మాజీ గంగమ్మ గుడి చైర్మన్ రూపేష్, చిత్తూరు జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షులుదీపికా కృష్ణమూర్తి,మాజీ గంగమ్మ గుడి చైర్మన్ అమ్ములు,లాయర్ జగదీష్, జనసేన పార్టీ నాయకులు అరుణ్, హర్షా రాయల్,తదితరులువెళ్లి ఆయనకు పూల బొకే అందించి సెలవా కప్పిఘనంగా సన్మానించారు.

## కుప్పంలో టీడీపీ శ్రేణులు సంబరాలు,చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం



**కుప్పం మేజర్‌న్యూస్:** పట్టణంలోని బుస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వత మెగా డిఎస్సీ తో పాటు,4 వేలు పించన్, ల్యాండ్ టైటిల్ ఆక్ట్ తో పాటు,స్కిల్ సెన్సస్పై, మొదటి 5 సంతకాలు చేసిన శుభ సందర్భంగా కేక్ కోసి ప్రజలకు పంచిపెట్టారు. ఎన్నికలలో చంద్రబాబు ఇచ్చిన హామీలపై తొలి సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు కుప్పంలో ప్రత్యేక మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.గత ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ బాధ్యులు పి.ఎస్.మునిరత్నం మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్బరామయ్యకు మంత్రి నారా లోకేష్ అభినందనలు



తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ : జరిగిన ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి అన్ని విధాలుగా కృషిచేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్యను మంత్రి నారా లోకేష్ అభినందించి అలింగనం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షులు వైవిపి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆయా నియోజకవర్గాల్లోని సర్పంచులను, ఎంపిటీసీలను సమన్వయం చేసి కూటమి విజయానికి సింగంశెట్టి సుబ్బరామయ్య కృషి చేశారు. అయితే తిరుమలలో మంత్రి నారా లోకేష్ ను సుబ్రమణ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ను శాలువుతో సత్కరించారు.